క్లుప్తంగా

వీఆర్వోలు పనితీరు మెరుగుపరచుకోవాలి



వీఆర్వోలతో మాట్లాడుతున్న ఆర్డీఓ సత్యనారాయణ

కాకినాడ రూరల్: రెవెన్యూ అంశాల్లో వీఆర్వోలు పనితీరు మెరుగు పరుచుకోవాలని ఆర్డీఓ ఎస్‌వీవీ సత్యనారాయణ కోరారు. సర్పవరం జంక్షన్ వద్ద తహశీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మురార్జీ అధ్యక్షతన ఆర్డీఓ వీఆర్వోలతో శుక్రవారం సమావేశమై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రజలకు నేరుగా సేవ చేసే అవకాశం కేవలం రెవెన్యూ శాఖకు మాత్రమే ఉందని, అందుకు అనుగుణంగా పనితీరు మెరుగు పరుచుకోవాలన్నారు. రీ సర్వే, జగనన్నకు చెబుదాం, స్పందన ప్రజా సమస్యల పరిష్కారానికి సంబంధించి నిర్ణీత గడువులో చర్యలు తీసుకోవాలన్నారు. డీటీలు కళ్యాణ్, శ్రీనివాస్, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

రోటరీ చేయూత భవన్‌కు రూ.లక్ష విరాళం



చేయూత భవన్‌కు విరాళాన్ని అందిస్తున్న క్లబ్ సభ్యులు

బోట్‌క్లబ్: ఉచిత వసతి, భోజనం, విద్యనందిస్తున్న చేయూత సంస్థ, రోటరీ గోల్డెన్‌జూబ్లీ క్లబ్ సంయుక్తంగా నిర్వహిస్తున్న రోటరీ చేయూత భవన్‌కు రోటరీ గవర్నర్ భాస్కర్‌రామ్ రూ.లక్ష చెక్కును అందించారు. ఈ చెక్కును శుక్రవారం క్లబ్ అధ్యక్షుడు కృష్ణ ప్రకాష్, మాజీ గవర్నర్ ఎస్‌వీఎస్ రావు చేయూత సంస్థ చైర్మన్ రవికి రోటరీ క్లబ్‌లో అందించారు. ఇటీవల గవర్నర్ సందర్శించినపుడు విద్యార్థులకు అదనంగా షెడ్ కావాలని అడగ్గా ఈ మేరకు సాయం అందించారన్నారు.

పాఠ్య పుస్తకాలు, జేవీకే కిట్లు అందించాలి

కాకినాడ సిటీ: ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో ఉన్న సమస్యలు పరిష్కరించి విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, విద్యా కానుక కిట్లు అందజేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ పాఠశాల ఉప తనిఖీ అధికారి ఎల్.గణేష్‌బాబును కలసి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, స్టేషనరీ విక్రయాలు జరగకుండా చూడాలని కోరారు. ఎస్ఎఫ్ఐ నాయకులు సూరిబాబు, దినేష్‌కుమార్, శివరాజు తదితరులు పాల్గొన్నారు.

19న బాస్కెట్ బాల్ జిల్లా జట్టు ఎంపిక

సామర్లకోట: ఆంధ్రప్రదేశ్ బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 23 నుంచి 25 వరకు గుంటూరులో జరుగనున్న అంతర్ జిల్లాల జూనియర్ బాలుర పోటీలకు 19వ తేదీన జిల్లా జట్టు ఎంపిక జరుగుతుందని మున్సిపల్ వైస్‌చైర్మన్ ఊబా జాన్‌మోజెస్ శుక్రవారం తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జరిగే ఎంపికలకు ఆసక్తి కలిగిన 18 ఏళ్ల లోపు బాలురు హాజరుకావాలన్నారు. జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.కొండలరావు, బండే కృష్ణార్జున్‌ల ఆధ్వర్యంలో ఎంపిక జరుగుతుందన్నారు. అభ్యర్థులు తమ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, టెన్త్ మార్కుల లిస్టు జిరాక్స్ తీసుకురావాలన్నారు. ఈ ఎంపిక పోటీలను రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు ప్రారంభిస్తారని, చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు దవులూరి సుబ్బారావు పాల్గొంటారని తెలిపారు.

వనదుర్గ అమ్మవారికి చండీహోమం



చండీ హోమంలో పూర్ణాహుతి చేస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. ఉదయం 9 గంటలకు పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేద పండితులు హనుమంతువజ్ఝల అవధాని, ముష్టి పురుషోత్తం, చిట్టెం వాసు, దేవులపల్లి ప్రకాష్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం జరిపారు. 14 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

సేవా సచివాలయాలు

- ముంగిటకే నేరుగా ప్రభుత్వ పథకాలు
- సత్ఫలితాలిస్తున్న ప్రజల వద్దకు పాలన

కాకినాడ రూరల్: ఒక ప్రభుత్వ ధ్రువపత్రం కావాలంటే వారాలు నెలల తరబడి సంబంధిత ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన పరిస్థితి ఉండేది ఒకప్పుడు. ఇక్కడ కాదంటే అక్కడ.. అక్కడ కాదంటే ఇంకెక్కడికో పరుగులు పెట్టాల్సి వచ్చేది. విసిరేసినట్టు ఎక్కడెక్కడో ఉండే కార్యాలయాలకు అలుపూ విరామం లేక విసిగి వేసారిపోయేదాకా తిరిగి తృణమో ఫణమో సమర్పిస్తే తప్ప సదరు పత్రం చేతికి వచ్చేది కాదు. మరి నేటి పరిస్థితి అందుకు పూర్తి విభిన్నం. గ్రామ సచివులంతా ఒకే గొడుగు కింద కొలువయ్యారు. ఆయా ప్రభుత్వ శాఖల ప్రతినిధులు గ్రామ సచివాలయంలో కొలువై ఉండడం ప్రజలకు ఎంతో ఉపశమనాన్ని ఇస్తోంది. మరో విషయం ఏంటంటే లబ్ధిదారు పెట్టిన అర్జీకి ఆ ప్రాంత వలంటీరే తదుపరి ప్రక్రియను పర్యవేక్షిస్తూ సదరు ధ్రువపత్రమో, పథకమో జారీ లేదా మంజూరయ్యే వరకు కూడా ఉంటున్నారు. ఇది కదా ప్రజల వద్దకు పాలన అంటే అని లబ్ధిదారులు ముందుగా వలంటీరుకు, తరువాత ఈ వ్యవస్థను ముంగిటకు తీసుకువచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు చెప్తున్నారు.

గతంలో జన్మభూమి కమిటీల సిఫార్సు ఉన్న వారికి, అనుయాయులకు మాత్రమే పింఛన్లు పథకాలు అందేవి. మరి నేడు.. అర్హతే ప్రామాణికంగా ప్రతి నెలా ఒకటో తేదీ తెల్లవారుజాము నుంచే టంఛనుగా పింఛను అందిస్తున్నారు. మాట తప్పని, మడమ తిప్పని సీఎం జగన్ ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాల మేరకు నవరత్నాలతో పాటు మరెన్నో పథకాలు ప్రజలకు మధ్యవర్తులు, దళారుల ప్రమేయం లేకుండా అసలైన లబ్ధిదారుకు వారి సమీప సచివాలయం ద్వారా నేరుగా అందజేస్తున్నారు.



ఆధునిక సదుపాయాలకు తోడు ప్రజలకు సేవల గురించి తెలియజేసే వివరాలతో సిబ్బంది పని చేసేందుకు వీలుగా గంగనాపల్లి సచివాలయ భవనం లోపలి భాగం

మండలం స్వరూపం

2011 లెక్కల ప్రకారం జనాభా	-	1,74,129
నివాస గృహాలు	-	60,138
గ్రామ పంచాయతీలు	-	18
గ్రామ సచివాలయాలు	-	41
సచివాలయాల్లో సిబ్బంది	-	299
గడచిన ఆరు నెలల్లో సేవలు	-	5360

విద్యా, వసతి దీవెనలు ఆదుకున్నాయి



నేను ఒంటరి మహిళను. భర్త వదిలి 13 ఏళ్లు అయ్యింది. కుమారుడు, కుమార్తె ఉన్నారు. వలంటీర్ల ద్వారా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యా దీవెన, వసతి దీవెన ఇచ్చి ఎంతో ఆదుకున్నారు. పిల్లల చదువు ఎంతో చక్కగా సాగుతోంది. మాకు తెలియని పథకాలను వలంటీర్లే మా అర్హత మేరకు అందిస్తున్నారు.

– పి.అలివేలు మంగతాయారు, వాకలపూడి

సకాలంలో సేవలు



గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా సకాలంలో ప్రజలకు సేవలు అందుతున్నాయి. అర్జీల పరిష్కారానికి, సంక్షేమ పథకాల అమలుకు నిత్యం పర్యవేక్షిస్తున్నాం. సకాలంలో సేవలు అందజేస్తూ ప్రజలకు చేరవయ్యాం. డివిజన్ పరిధిలో సచివాలయాల పనితీరు మెరుగ్గా ఉంది.

– పాతంశెట్టి నారాయణమూర్తి, డీఎల్‌డీఓ, కాకినాడ డివిజన్

రుణ ప్రక్రియ వేగవంతం చేయండి



అభివృద్ధి పనులను పర్యవేక్షించి సూచనలు ఇస్తున్న కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్

కాకినాడ: టిడ్కో లబ్ధిదారులకు పెండింగ్‌లో ఉన్న రుణాలను సత్వరమే మంజూరు చేసేందుకు చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ కోరారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో శుక్రవారం టిడ్కో రుణాలపై ఆయన బ్యాంకర్లతో సమావేశమయ్యారు. 2056 టిడ్కో ఇళ్లల్లో 175 ఇళ్లకు రుణాలు మంజూరు కావాల్సి ఉందని, బ్యాంకర్లు సహకరించాలని కోరారు. నెలాఖరుకు రిజిస్ట్రేషన్లు పూర్తయ్యేలా అధికారులు చొరవ తీసుకోవాలని సూచించారు. ఏడీసీ సీహెచ్ నాగనరసింహారావు, టిడ్కో ఈఈ రీట, టీపీఆర్వో మానే కృష్ణమోహన్, బ్యాంకర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

నగరంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను కమిషనర్ మహేష్‌కుమార్ శుక్రవారం పర్యవేక్షించి సంబంధిత అధికారులకు సూచనలిచ్చారు. ఆయన వెంట స్మార్ట్‌సిటీ ఎస్ఈ ఎం.వెంకట్రావు, డిప్యూటీ సిటీ ప్లానర్ హరిదాసు, ఏసీపీ నాగశాస్త్రులు, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

ఉత్తమ ప్రదర్శన నిశ్శబ్దమా నీ ఖరీదెంత?



'నిశ్శబ్దమా నీ ఖరీదెంత' దర్శకుడు కృష్ణప్రసాద్ బృందానికి ప్రథమ బహుమతిని అందజేస్తున్న క్లబ్ అధ్యక్షులు భాస్కరరావు తదితరులు

- ముగిసిన జాతీయస్థాయి నాటిక పోటీలు
- చీకటి పువ్వు, అతీతం నాటికలకు ద్వితీయ, తృతీయ బహుమతులు

కాకినాడ కల్చరల్: స్థానిక ది యంగ్‌మెన్స్ హ్యాపీ క్లబ్ దంటు కళాక్షేత్రంలో కాకినాడ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న జాతీయ స్థాయి నాటిక పోటీలు శుక్రవారంతో ముగిసాయి. విశాఖపట్టణం వారి తెలుగు కళాసమితి సమర్పణలో చలసాని కృష్ణప్రసాద్ దర్శకత్వంలో ప్రదర్శించిన 'నిశ్శబ్దమా నీ ఖరీదెంత?' నాటిక ఉత్తమ ప్రదర్శనగా ఎంపికైంది. ద్వితీయ ప్రదర్శనగా చైతన్య కళాభారతి (కరీంనగర్) సమర్పణలో ప్రదర్శించిన చీకటి పువ్వు, తృతీయ ప్రదర్శనగా అభినయ ఆర్ట్స్ (గుంటూరు) సమర్పణలో ప్రదర్శించిన అతీతం నాటికలు ఎంపికయ్యాయి ఎంపికయింది. ఉత్తమ నటుడిగా అతీతం నాటికలో రాఘవ పాత్రధారి యస్.రవీంద్రరెడ్డి, ఉత్తమ నటిగా చీకటి పువ్వు నాటికలో పవిత్ర పాత్రధారి లహరి ఎంపికయ్యారు. వీరికి ది యంగ్మెన్స్ హ్యాపీక్లబ్ అధ్యక్షులు దంటు భాస్కరావు బహుమతులు ప్రదానం చేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో పీవీ రావు, అసోసియేషన్ కన్వీనర్లు ఎన్.ప్రభుదాస్, కె.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

కష్టించేవారికి సముచిత స్థానం

- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి
- వేడుకగా మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం



వెంకటలక్ష్మికి పూలదండ వేసి అభినందిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: క్రమశిక్షణ, అంకిత భావంతో పనిచేసే ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం లభిస్తుందని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి స్పష్టం చేశారు. స్థానిక డి కన్వెన్షన్‌లో శుక్రవారం కాకినాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పసుపులేటి వెంకటలక్ష్మి, డైరెక్టర్ల ప్రమాణస్వీకారం వేడుకగా జరిగింది. వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎమ్మెల్యే ద్వారంపూడి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి నిస్వార్థ సేవలందించిన పసుపులేటి వెంకటలక్ష్మి సేవలకు గుర్తింపుగా ఈ పదవి ఇచ్చామన్నారు. రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి గెలుపొందడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త, నాయకుడు మరింత శ్రమించాలని పిలుపునిచ్చారు. కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా కాకినాడలో పనిచేసే మహిళా కార్యకర్తలు, నాయకులకు ఎమ్మెల్యే ఎంతో ప్రాముఖ్యతనిస్తున్నారన్నారు. సుంకర శివప్రసన్న మాట్లాడుతూ శ్రమకు తగ్గ గుర్తింపు పసుపులేటికి దక్కిందన్నారు. చైర్మన్ వెంకటలక్ష్మి మాట్లాడుతూ తానెప్పుడూ పదవులను ఆశించలేదని, చేసిన సేవలను గుర్తించి ఎమ్మెల్యే ద్వారంపూడి ఈ పదవికి ఎంపిక చేయడం సంతోషంగా ఉందన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, జిల్లా మహిళా అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శి రావూరి వెంకటేశ్వరరావు, స్మార్ట్ సిటీ మాజీ చైర్మన్ అల్లి రాజబాబు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బెండా విష్ణుమూర్తి, పోష్ కమిటీ సభ్యురాలు కృష్ణప్రియ, సూపర్‌బజార్ చైర్మన్ ముమ్మిడి గోవిందు తదితరులు పాల్గొన్నారు. కమిటీ ఉపాధ్యక్షుడిగా థోణి చిట్టిబాబు, డైరెక్టర్లుగా మాకిరెడ్డి పద్మావతి, గంధం మంగాదేవి, పోతాప్రగడ వెంకట రవికుమార్, మోసా సూర్యకుమారి, పాలెపు రవికుమార్, పాడిశెట్టి సుబ్రహ్మణ్యేశ్వరరావు, షేక్‌ఖాదర్ మొహిద్దీన్, మద్దాల ఎస్.మూర్తి, మందపల్లి మీరమ్మ, సింహాద్రి కృష్ణకుమారి, ఉంగరాల వెంకటేశ్వరరావు, శంఖ అనంత సత్యవతి అనసూయ, కొట్టాల శివప్రసాద్ సభ్యులుగా ప్రమాణస్వీకారం చేశారు.

జగన్ పాలనలో విద్యావ్యవస్థకు మెరుగులు

- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి
- జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ



విద్యార్థులకు కిట్లను పంపిణీ చేస్తున్న సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక గడచిన నాలుగేళ్లలో విద్యావ్యవస్థకు ఎన్నో మెరుగులు దిద్దారని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలు గణనీయంగా పెరగడమే ఇందుకు నిదర్శనమన్నారు. స్థానిక జగన్నాథపురంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి కల్యాణమండపంలో శుక్రవారం జేవీకే కిట్లను ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని అందజేశారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు, పతకాలు, సర్టిఫికెట్లను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కనీస అవసరాలైన విద్య, వైద్యం, గృహ నిర్మాణానికి సీఎం జగన్ ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. దీంతో మున్నెడూ లేని రీతిలో నేడు ప్రభుత్వ పాఠశాలల్లో సీట్ల కోసం విపరీతమైన పోటీ ఏర్పడిందన్నారు. కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, ఉపవిద్యాశాఖాధికారి ఆర్‌జేడీ రాజు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ ఎల్.గణేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ఫలాలతో ప్రజల్లో సంతృప్తి

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- నడకుదురులో గడప గడపకూ..



నడకుదురులో ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కరప: సంక్షేమ ఫలాలతో ప్రజల్లో ప్రభుత్వ పాలనపై సంతృప్తి నెలకొందని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. మండలం నడకుదురు గ్రామంలో సచివాలయం–1, 2 పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని రెండో రోజు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికీ పర్యటించి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు వాటి లబ్ధిని ప్రజలకు తెలియజేశారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. ఏడాది లోపే ఎన్నికలు వస్తున్నందున వైఎస్సార్ సీపీకి మద్దతుగా నిలచి జగన్‌ను సీఎంగా మరోసారి చేయాలని, తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, పైలా గోవిందు, జవ్వాది సతీష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చదువుల్లో మెరికలు.. ఆణిముత్యాల్లా మెరుపులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- టాపర్లకు ప్రోత్సాహకాలు అందజేత

కరప: ప్రభుత్వ పాఠశాలల్లో చదువులు విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించేలా ఉన్నాయని, విద్యార్థులు ఆణిముత్యాలుగా మెరుస్తున్నారని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. కరప మండలం 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులను శుక్రవారం ఆయన సన్మానించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పెంకె శ్రీలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించి, సత్కరించి నగదు ప్రోత్సాహకాలను అందించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, ఎంఈవో కొప్పుల బులి కృష్ణవేణి, ఈవో పీఆర్డీ సలాది వెంకట శ్రీనివాసరావు, ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సర్పంచ్‌లు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

వనమాడీ.. మాపై ఎందుకీ కక్ష

- శ్రామికులపై డ్రగ్స్ ముద్ర తగదు
- వాహన డ్రైవర్ల వినూత్న నిరసన



వనమాడి వ్యాఖ్యలకు నిరసనగా నినాదాలు చేస్తున్న వాహన డ్రైవర్లు

కాకినాడ: డంపింగ్ యార్డులోని హూపర్‌టిప్పర్ వాహనాల ద్వారా గంజాయి వంటి మత్తుపదార్థాల రవాణా జరుగుతుందంటూ టీడీపీ మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు చేసిన వ్యాఖ్యలపై క్లాప్ డ్రైవర్లు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఎంతో కష్టించి పనిచేస్తూ ఉదయాన్నే ఇంటింటికి వెళ్లి తడి–పొడిచెత్తను సేకరిస్తూ సేవలందిస్తున్న తమపై ఎందుకింత కక్ష అని ఆవేదన వ్యక్తం చేశారు. కొండబాబు వ్యాఖ్యలను ఉపసంహరించుకుని క్షమాపణ చెప్పాలని డ్రైవర్లు శుక్రవారం డంపింగ్ యార్డు నుంచి సుమారు 100 హూపర్‌టిప్పర్ వాహనాలతో జగన్నాథపురం, వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్, సినిమా రోడ్డు, భానుగుడి, మెయిన్‌రోడ్డు మీదుగా నిరసన ర్యాలీ చేశారు. తాము ఎదుర్కొనే సమస్యలపై స్పందించి న్యాయం చేస్తే సంతోషిస్తామని, లేనిపోని నిందలతో అవమానిస్తే ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. కొండబాబు తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకునే వరకు నిరసన కొనసాగిస్తామని పేర్కొన్నారు.



ర్యాలీగా వెళ్తున్న హూపర్ టిప్పర్ వాహనాలు

విద్యార్థులే భావి భారత నిర్మాతలు



సదస్సులో మాట్లాడుతున్న బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్

బోట్‌క్లబ్: భారతదేశం అగ్రరాజ్యంగా ఎదిగేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2047 విజన్ ప్రతిపాదించారని, దాని లక్ష్యసాధనకు విద్యార్థులంతా కృషి చేసి భావి భారత నిర్మాతలుగా మారాలని బీజేపీ జాతీయ కార్యదర్శి వై.సత్యకుమార్ అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం కాకినాడలో ఆయన సంపర్క్ సే సమర్థన్ కార్యక్రమంలో భాగంగా నగరంలో పలువురిని కలుసుకున్నారు. ఈసందర్భంగా స్థానిక అండాళ్లమ్మ కళాశాల్లో భారత్ 2047 విజన్, రోడ్‌మ్యాప్‌పై నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ దేశంలో ఏటా రెండు కోట్ల మందికి ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తుండగా, మిగిలిన వారికి ముద్ర పథకం ద్వారా రుణాలు, యువ పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలు, ప్రయోజనాలు కల్పిస్తోందన్నారు. అభివృద్ధే ధ్యేయంగా మోదీ అవినీతి రహిత పాలన చేస్తున్నారన్నారు. విద్యార్థులు విచక్షణతో ఎన్నికల్లో అభివృద్ధి, దేశం సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఓటు వేయాలన్నారు. అనంతరం డాక్టర్ చిట్ల కిరణ్, పద్మశ్రీ డాక్టర్ సంకురాత్రి చంద్రశేఖర్‌తో పాటు పలువురిని కలుసుకున్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు చిలుకూరి రామ్‌కుమార్, రాష్ట్ర మేధావి విభాగ కన్వీనర్ ముత్తా నవీన్‌కృష్ణ, కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు యార్లగడ్డ రామ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి రంభాల వేంకటేశ్వరరావు, నాయకులు నందమూరి వినోద్, పైడా వెంకటనారాయణ పాల్గొన్నారు.

విశ్రాంత జీవుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న విశ్రాంత ఉద్యోగులు

బోట్‌క్లబ్: ఉమ్మడి తూర్పుగోదావరి 1978 డీఎస్‌సీ ప్యానెల్ జిల్లా పరిషత్ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం కాకినాడలో ఒక హోటల్‌లో జరిగింది. వివిధ హోదాల్లో పదవీ విరమణ చేసిన వారంతా ఒక చోట కలుసుకొని అలనాటి జ్ఞాపకాలును నెమరవేసుకున్నారు. దేశంలో పలు ప్రాంతాల్లో స్థిరపడిన వారు 45 ఏళ్ల తర్వాత కలుసుకుని సందడి చేశారు. అప్పటి జెడ్పీ కార్యదర్శి దివంగత కళా వెంకట్రావు చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించారు. పంచాయతీరాజ్ విశ్రాంత డిప్యూటీ కమిషనర్ సీఎస్‌వీఎస్ కొండయ్యశాస్త్రి, విశ్రాంత జేడీ కన్నబాబు, విశ్రాంత ఏఓ నేలపూడి ఉష, ఉద్యోగులు తుమ్మల నూకరాజు, పైన్ని సూర్యనారాయణ, కస్తూరి రాజారావు, వెంకట కుమార్, విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు



ఏకశిల పెద్ద నందికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకులు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. మాస శివరాత్రిని పురస్కరించుకుని ఆలయంలో ఉన్న ఏకశిలా నందికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. తెల్లవారు జాము నుంచి స్వామి వారికి అభిషేకాలు, పూజలు చేశారు.